సాక్షి శ్రీకాకుళం



నిబంధనలు పట్టవా..?

నర్సింగ్ కళాశాలలో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తున్నారు.

-12లో



మొక్కజొన్నకు 'మద్దతు' కరువు!

మొక్కజొన్న రైతుకు మద్దతు కరువైంది. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండటంతో భారీగా నష్టపోతున్నారు.

-12లో

జాబ్‌మేళాలో 112 మంది ఎంపిక

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 112 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. మొత్తం 327 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్, ప్రిన్సిపల్ పి.లత తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్‌శ్రీ సీఈఓ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్ సప్లిమెంటరీ హాల్‌టికెట్ల పంపిణీ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు కళాశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేస్తున్నారు. ఐపీఈ మార్చి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులతోపాటు వివిధ సబ్జెక్టుల్లో తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు బెటర్‌మెంట్ రాసుకునేందుకు ఈ నెల 12 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్న విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా 56 కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్‌కు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు సెకెండియర్ విద్యార్థులకు పరీక్షలు జరగనున్నాయి. బీఐఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్ నుంచి కూడా విద్యార్థులు నేరుగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు సూచిస్తున్నారు.

ఏపీఎస్పీ కమాండెంట్‌గా పద్మనాభరాజు



పద్మనాభరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో ప్రారంభించిన 1వ ఏపీఎస్పీ (ఐఆర్) నూతన కమాండెంట్‌గా పద్మనాభరాజును నియమిస్తూ పోలీస్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు నిర్వహణ, తీవ్రవాద నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్ట వంటి చర్యల్లో సివిల్ పోలీసులకు సహాయం చేయటం, సలహాలు ఇచ్చేందుకు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఎచ్చెర్ల ప్రాంతంలో బెటాలియన్ నిర్మాణం ఏర్పాట్లు సైతం పర్యవేక్షిస్తున్నారు. అడిషనల్ కమాండెంటెంట్ పి.సత్తిబాబు, అధికారులు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 21వ బ్యాచ్‌కు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 3వ వారంలో ప్రారంభమయ్యే శిక్షణకు 16 మందికే అవకాశం ఉందని, పూర్తి వివరాలకు 9441161051, 9390886033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అనుమానితులతో జాగ్రత్త



మత్స్యకారులతో మాట్లాడుతున్న మెరైన్ సీఐ ప్రసాదరావు

గార : సముద్రం, తీర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు సంచరిస్తే వెంటనే సమాచారమివ్వాలని కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు కోరారు. శుక్రవారం గార మండలం బందరువానిపేట, కె.మత్స్యలేశం గ్రామాల్లో భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో మత్స్యకారులకు అవగాహన కల్పించారు. సముద్రంలో వేట సాగిస్తున్నప్పుడు వేరే దేశాల బోట్లు వస్తుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజాభద్రతకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై మహాలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

కాశీబుగ్గ: ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలకు ప్రాధాన్యమిచ్చి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో పోలీసు గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. విచారణ చేపట్టి పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలం వీరుల అక్షరాగ్రహం



కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పాత్రికేయుల నిరసన

సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు అక్రమంగా సోదాలు నిర్వహించడంపై జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడుతున్నారు. తమకు నచ్చని పత్రికలు, పాత్రికేయులపై కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నారు. పోలీసులు, ప్రభుత్వ వైఖరిపై నిరసన వ్యక్తం చేస్తూ అధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

❝ దుశ్చర్యలు మానుకోవాలి



సాక్షి ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంట్లో అక్రమంగా సోదాలు పత్రికా స్వేచ్ఛను హరించడమే. ఇలాంటి దుశ్చర్యలు ప్రభుత్వం మానుకోవాలి. కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ తెరిచి పత్రికా ఎడిటర్లు, జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలు చేపట్టడం ప్రభుత్వానికి మంచిదికాదు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు పని చేసినా జర్నలిస్టుల జోలికి ఎవరూ పోలేదు. ఇప్పుడు సెర్చ్ వారెంట్, నోటీసులు లేకుండా సాక్షి ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు చొరబడటం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడమే.

– బొడ్డేపల్లి మోహన్‌రావు, ప్రజా న్యాయవాది, ఆమదాలవలస సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షుడు

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆమదాలవలసలో జర్నలిస్టులు శుక్రవారం ధర్నా చేపట్టారు. అక్రమంగా సోదాలు నిర్వహించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు ఎస్.రాంబాబుకు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ఆమదాలవలస సిటిజన్ ఫోరం ఉపాధ్యక్షులు, ప్రజా న్యాయవాది బొడ్డేపల్లి మోహన్‌రావు, సీనియర్ జర్నలిస్టులు యల్లాపంతుల శ్రీనివాసరావు, తమ్మినేని వాసుదేవరావు, మొజ్జాడ అన్నంనాయుడు, చంద్రశేఖర్, పి.రామారావు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆమదాలవలస తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



పలాస ఆర్డీఓ వెంకటేష్‌కు వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు, ప్రజా సంఘాల నాయకులు

కాశీబుగ్గలో..

కాశీబుగ్గ: పత్రికా స్వేచ్ఛపై దాడిని ఖండిస్తూ కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ జి.వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చిగురువలస జగదీష్, జాతీయ కన్వీనర్ దానేశ్వర మహారణ, అరసం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణారావు, సీఐటీయూ నేత నెయ్యల గణపతి, పీడీఎస్‌యూ ప్రతినిధి మద్దిల వినోద్‌కుమార్, కోనారి హేమసుదన్, వంకల రాజారావు, శర్వాణ రవికుమార్, నంబాళ్ల రమేష్‌కుమార్, రట్టి జోగారావు, మురళి, పత్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బేర్‌మంటున్న యూబీ బీర్లు!






యూబీ కంపెనీలో అవక్షేపాలు ఉన్న బ్యాచ్‌ల కేసులను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు(ఫైల్)

యూబీ బీర్లలో సెడిమెంట్స్

- ఎక్సైజ్ అధికారుల ల్యాబ్ పరీక్షల్లో వెల్లడి
- అవక్షేపాలు ఉండటంతో బీరుగా గుర్తించని అధికారులు
- మార్కెట్‌కు వెళ్లకుండా అడ్డుకట్ట
- గత ఐదు నెలలుగా కంపెనీకే పరిమితమైన రూ.6కోట్ల విలువైన బీర్లు
- ప్రమాణాల మేరకే ఉన్నాయంటున్న కంపెనీ ప్రతినిధులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

రణస్థలంలోని యూబీ కంపెనీలో తయారైన బీర్లు ప్రమాణాల మేరకు లేవా? వాటిలో అవక్షేపాలు ఉంటున్నాయా? మందుబాబుల ఆరోగ్యాన్ని దెబ్బతీసేలా బీర్లు ఉంటున్నాయా? అంటే అవుననే అన్పిస్తోంది. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో తయారైన బీరు శాంపిల్స్‌ను అధికారులు ల్యాబ్‌లో పరీక్షించేసరికి డొల్లతనం బయట పడింది. దాదాపు 12,76,128 బీర్లు తేడాగా ఉన్నట్టు గుర్తించారు. 10 బ్యాచ్‌లకు చెందిన సుమారు రూ.6కోట్ల విలువైన బాటిల్స్‌లో తేడా ఉందని నిగ్గు తేల్చారు. యూబీ కంపెనీలో తయారైన ఉత్పత్తులు బీరుగా పాస్ కాలేదని అధికారులు స్పష్టం చేయగా, అన్నీ బాగున్నాయని, తాము చేసిన పరీక్షల్లో ప్రమాణాల మేరకే ఉన్నాయని యూబీ కంపెనీ ప్రతినిధులు వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఒక్కొక్క బాటిల్‌ను పరిశీలించి, అవక్షేపాలతో ఉన్న బాటిల్స్ ఏవీ? క్లియర్‌గా ఉన్నవేవీ? గుర్తించాలని ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ తాజాగా యాక్షన్ ప్లాన్ జారీ చేశారు.



మార్కెట్‌లోకి అనుమతివ్వని అధికారులు..

రణస్థలంలోని యునైటెడ్ బ్రూవరీస్ (యూబీ) కంపెనీలో తయారైన బీరు బాటిల్స్‌లో అవక్షేపాలు(సెడిమెంట్స్) కన్పించాయి. సేవించడానికి వీల్లేని బీర్లుగా అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలోని ఎక్సైజ్ ల్యాబ్‌లో సదరు బీరు శాంపిల్స్‌ను పరీక్షించగా, ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ల్యాబ్ నివేదిక ఆధారంగా 267,268,269,270, 271,272, 273, 274, 275, 325బ్యాచ్‌లకు చెందిన 1,60,344 కేసులను (ఒక్కొక్క కేసుకు 12 బాటిల్స్) బీరుగా అధికారులు గుర్తించలేదు. వీటిని మార్కెట్‌లోకి పంపించడానికి వీల్లేదని అభ్యంతరం తెలిపారు. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో ఈ ఉత్పత్తులు జరిగాయి. తాము మరో ల్యాబ్‌లో చేసిన పరీక్షల్లో ప్రమాణాల మేరకే ఉన్నాయని యూబీ కంపెనీ ప్రతినిధులు అపీలు చేసుకున్నా అనుమతి లభించలేదు. ప్రస్తుతానికి ఆ బీర్లు అన్నీ యూబీ కంపెనీలో ఉన్నాయి.

సమీపించిన ఎక్స్పైరీ డేట్..

అధికారులు చేసిన ల్యాబ్ పరీక్షల్లో అవక్షేపాలున్న బీర్లలో 267, 268 బ్యాచ్‌లకు చెందిన 4,01,820 బాటిల్స్ ఈనెల 29న ఎక్స్పైరీ కానున్నాయి. 3,06,456 బాటిల్స్ ఈనెల 30న, మరో 56,832బాటిల్స్ జూన్4న, 3,59,004 బాటిల్స్ జూన్ 5న, 1,52,016 జూన్ 28న కాలం చెల్లనున్నాయి. అయినప్పటికీ వాటిని మార్కెట్‌లోకి పంపించడానికి అనుమతి ఇవ్వాలని యూబీ ప్రతినిధులు కోరుతున్నారు. తమదైన శైలిలో లాబీయింగ్ చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖలోని కొందర్ని ప్రభావితం చేస్తున్నట్టు తెలుస్తోంది. వాస్తవంగా ఇక్కడ తయారైన బాటిల్స్ ఐఎంఎల్ గొడౌన్‌కు పంపించాలి. అక్కడి నుంచి లైసెన్సుడ్ షాపులకు, బార్‌లకు పంపించాలి. ఇదంతా చేయడానికి కొంత సమయం పడుతుంది. ఆలోపే ఈ బీరు బాటిల్స్ కాలం చెల్లనున్నాయి.

సేగ్రిగేషన్‌కు ఆదేశాలు..

తాజాగా ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ సెడిమెంట్స్(అవక్షేపాలు)తో ఉన్న బాటిల్స్ ప్రతీ ఒక్కదాన్ని పరిశీలించి, సేగ్రిగేషన్(విభజన) చేయాలని యాక్షన్ ప్లాన్ జారీ చేశారు.

- అవక్షేపాలతో ఉన్న బీర్లు ఏవీ? క్లియర్‌గా ఉన్నవేంటి? అనేది విభజన చేయాలని అధికారులను ఆదేశించారు.
- ముగ్గురు నలుగురు అసిస్టెంట్ కమిషనర్ల పర్యవేక్షణలో 30 లేదా 40మంది అనుభవజ్ఞులైన కార్మికులను నియమించాలని, ఒక్కొక్క కార్మికుడు గంటకి 800 నుంచి 1000 బాటిల్స్ పరిశీలించాలని, రోజుకి 8 నుంచి 16 గంటల పాటు షిఫ్టుగా చేసుకుని 10రోజుల పాటు సేగ్రిగేషన్ చేయాలని ప్రత్యేక షెడ్యూల్ ఇచ్చారు.
- పరిశీలించిన వాటిలో అవక్షేపాలు ఉన్న బాటిల్స్ ఎన్ని, క్లియర్‌గా ఉన్న బాటిల్స్ ఎన్ని నిర్ధారించి, క్లియర్‌గా ఉన్న బాటిల్స్‌ను మరోసారి ప్రభుత్వ ల్యాబ్‌తో పాటు మరో ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయించాలని సూచించారు.
- ఈ నెల 7వ తేదీ నుంచే ఈ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు.

అసలే ప్రభుత్వ ల్యాబ్‌లో అవక్షేపాలున్నట్టు గుర్తించిన బాటిల్స్ అవి.. ఆ పైన వాటి ఎక్స్పైరీ డేట్ కూడా సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా సేగ్రిగేషన్‌కు ఆదేశాలివ్వడం వెనక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇందులో ఏదో మాయాజాలం, గూడుపుఠాణి నడుస్తున్నట్టుగా తెలుస్తోంది. 10 రోజుల పాటు పరిశీలించి, ఆ తర్వాత ల్యాబ్‌కు పరీక్షలకు పంపించి, రిపోర్టులు తెచ్చుకునేలోపే ఆ బాటిల్స్ కాలం చెల్లనున్నాయి. ఈ పరిస్థితుల్లో సేగ్రిగేషన్‌కు ఆదేశించడం గమనార్హం. ఒకవేళ సేగ్రిగేషన్‌లో ప్రమాణాల మేరకు ఉన్నాయని తేలినా, ఎక్స్పైరీ డేట్ కారణంగా మార్కెట్‌లోకి పంపించడానికి అవకాశం ఉండదు. అలాంటప్పుడు ఇప్పు డెందుకు ఈ తంతు అని ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. యూబీ ప్రతినిధులు కోరినట్టు మార్కెట్‌లోకి పంపించడానికి వ్యూహాత్మకంగా వేస్తున్న అడుగులా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.



యూబీ కంపెనీలో ఉత్పత్తి చేసిన బీరును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

పత్రికల గొంతు నొక్కే ప్రయత్నం సరికాదు


- 'సాక్షి'తో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు టి.తిరుపతిరావు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజల తరపున ప్రభుత్వాలను ప్రశ్నించే పత్రికల గొంతు నొక్కే ప్రయత్నాలను పాలకులు మానుకోవాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు టి.తిరుపతిరావు అన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో నిబంధనలకు విరుద్ధంగా సోదాలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో శుక్రవారం 'సాక్షి'తో మాట్లాడారు.

ప్రభుత్వం ఇలా | ప్రజాస్వామ్యం బతికేదెలా..

- సమాజంలో ప్రజలకు వాస్తవాలు తెలియజేసేవి పత్రికలే. అటువంటి వారి గొంతు నొక్కేయాలన్న ప్రయత్నం రాజకీయ పార్టీలు మానుకోవాలి. రాజ్యాంగంలో ఫోర్త్‌ఎస్టేట్‌గా భావించే నాలుగో స్తంభాన్ని విరగ్గొట్టాలని చూడటం పాలకులకు తగదు.
- ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛను హరించే రాజకీయ పార్టీలు, వ్యాపారవేత్తలు ప్రపంచ చరిత్రలో మనుగడలేకుండాపోయారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలు అమలుచే యడం మానేసి వాస్తవాల్ని తెలియజేసే పత్రికలు, మీడియాలపై పోలీసులతో కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారు.
- కూటమి ప్రభుత్వం తీరును ప్రశ్నిస్తున్న సోషల్ మీడియా వాదులపైనా కేసులు పెట్టడం దారుణం.
- ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని తరహాలు రెడ్‌బుక్ పేరిట కక్షసాధింపులు చర్యలు చేపడుతున్నారు. ఇటువంటివి తగ్గించుకుని ప్రజలకిచ్చే హామీలపై దృష్టి సారిస్తే మంచిది.
- పత్రికాస్వేచ్ఛను కాపాడితేనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుంది. లేదంటే కార్పొరేట్ శక్తులకు, రియల్టర్ల హవా కొనసాగి సామాన్యుడికి తిండిలేని దుస్థితికి ప్రభుత్వాలు తీసుకొస్తాయి.



జోడు పిక్క

సాధారణంగా జీడిపండుకు ఒక పిక్క మాత్రమే ఉంటుంది. అయితే ఎచ్చెర్ల మండలం చిన రావుపల్లిలోని బొడ్డేపల్లి గణేష్‌కు చెందిన జీడితోటలో మాత్రం ఒక జీడిపండుకు రెండు పిక్కలు కనిపించాయి. ఈ విషయమై వ్యవసాయాధికారి సురేష్ మాట్లాడుతూ జన్యుపరంగా రెండు పిక్కలు కాసే అవకాశం ఉందని చెప్పారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

'మత్తు'ను చిత్తు చేద్దాం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డితో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు, వర్కర్లు, ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల సరఫరా జరుగుతున్నట్లు తెలిసిందని, డ్రగ్స్ విక్రయాలు జరిగే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాసం కల్పించాలన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మెడికల్ షాపులన్నింటిలోనూ సీసీ కెమెరాలు అమర్చాలని ఆదేశించారు. ఎస్పీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈగల్ టీంలు మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక నిఘా పెట్టాయని చెప్పారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే 112, 1972 నంబర్లకు తెలియజేయాలని కోరారు. రిమ్స్‌లోని డీ–అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

వేగం పెంచిన విజిలెన్స్

- ఆదిత్యాలయంలో అక్రమాలపై వడివడిగా విజిలెన్స్ విచారణ
- గతేడాది ప్రసాదాల విభాగం ఖర్చులపై వాంగ్మూలాల సేకరణ
- వాస్తవాలు చెప్పేసిన రికార్డు అసిస్టెంట్‌పై అక్రమార్కుల గుర్రు

అరసవల్లి:

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక అరసవల్లి ఆదిత్యుని ఆలయంలోని పలు విభాగాల్లో జరిగిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. గతేడాది ఆలయ ఈవోగా పనిచేసిన చంద్రశేఖర్ హయాంలో రూ.లక్షల్లో అవినీతి అక్రమాలు జరిగాయంటూ.. ఇదే ఆలయంలో పనిచేసి విధుల నుంచి సస్పెండైన సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు విజిలెన్స్ అధికారులకు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఆలయంలో అప్పట్లో జరిగిన పలు అక్రమాలపై విజిలెన్స్ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టింది.

వాస్తవాలు చెప్పాడని కక్ష..

రికార్డు అసిస్టెంట్ శిమ్మ మల్లేశ్వరరావు పేరిట మొత్తం 19 చెక్కులను రాసేసి..అతని ప్రమేయం లేకుండానే నేరుగా బ్యాంకుల్లో నగదు డ్రా చేయించుకున్నారని కూడా విజిలెన్స్ అధికారులు గుర్తించారు. భక్తులకు మజ్జిగ, పాలను పంపిణీ చేయకుండానే సుమారు రూ.3.50 లక్షల వరకు ఆలయ ఉద్యోగులే జేబులు నింపుకొన్నారని తేలింది. ఈ సమాచారంలో వాస్తవాలన్నీ శిమ్మ మల్లేశ్వరరావు



పూసగుచ్చినట్లుగా విజిలెన్స్ అధికారులకు చెప్పడంతో ఆ దిశగా విచారణ వేగవంతం చేస్తున్నారు. కాగా, వాస్తవాలన్నీ విజిలెన్స్ అధికారులకు మల్లేశ్వరరావు ఒక్కడే చెప్పేశాడనే విషయం బయటకు పొక్కడంతో అక్రమార్కులంతా కలిసి అతనిని టార్గెట్ చేశారు. ఈయనపై ఇంతవరకు ఎలాంటి రిమార్క్ లేదన్న గుర్తింపు స్థానికంగా ఉంది. అయితే తమ అక్రమాలను బయటపెట్టాడన్న కారణంతో ఎలాగైనా మల్లేశ్వరరావుపై ఏదో ఒక అవినీతి మరక అంటించాలనేలా ఆ 'ఉద్యోగులు' కుట్రలకు దిగినట్లు సమాచారం.

ప్రసాద విక్రయాలను సాకుగా చూపించి..

కొత్తగా ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన కె.శోభారాణి ఈ నెల 4న ప్రసాదాల విక్రయాలను తనిఖీ చేయగా తక్కువగా విక్రయాలు జరుగుతున్నాయని గుర్తించారు. గతేడాది వైశాఖ తొలి ఆదివారంలో ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.4 లక్షల వరకు ఆదాయం రాగా.. మొన్నటి తొలి ఆదివారం (ఈనెల 4న) కేవలం రూ.2.20 లక్షల వరకు మాత్రమే ఆదాయం రావడంపై ఈవో మండిపడ్డారు. గత ఏడాది వైశాఖంలో పక్కా భవనాల్లో ఆలయానికి ఎదురుగా విక్రయాలు జరిగాయని, ఇప్పుడు భవనాలన్నీ కూల్చేయడంతో తాత్కాలిక భవనాల్లో ప్రసాదాల కౌంటర్లకు భక్తుల రాక తగ్గిందని అందుకే ఆదాయం కొంత తగ్గిందనే విషయం ఆలయ వర్గాలకు తెలిసినా.. దాన్ని ప్రస్తావించకుండా ఆదాయం తగ్గడానికి ప్రసాదాల విభాగంలో పనిచేస్తున్న మల్లేశ్వరరావు మాత్రమే కారకుడనేలా ఈవోకు ఫీడ్‌బ్యాక్ అందించారు. ఇక్కడి రాజకీయాలు తెలియని ఈవో శోభారాణి తొలి ఆదివారం ఆదాయం తగ్గడానికి కారకుడిగా మల్లేశ్వరరావుపై చర్యలు చేపడతానంటూ శివాలెత్తడం గమనార్హం.

త్వరలో మరిన్ని వాస్తవాలు బయటకు..!



విజిలెన్స్ విచారణలో మరిన్ని వాస్తవాలు బయట పడనున్నాయి. ఇప్పటికే ఇక్కడ డిప్యుటేషన్ ప్రాతిపదికన అటెండర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు పీఆర్సీ వర్తింపజేయడంతో పాటు 2022 ఆగస్టు నుంచి పీఆర్సీ ఎరియర్స్ కింద రూ.5.72 లక్షల ఆలయ సొమ్మును అతనికి చెల్లించడంపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేరింది. రిటైర్డ్ ఉద్యోగిగా పనిచేస్తున్న జగన్మోహనరావు క్యాష్ బుక్‌లో అక్రమాలు, తప్పుడు బిల్లులు చూపించడంపై కూడా ఫిర్యాదు చేరింది. వీటితో పాటు త్వరలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి అచ్చే అవకాశముంది.

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కొయ్యాం పంచాయతీ కొత్తవానిపేట గ్రామానికి చెందిన కొత్త రమణ (32) పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మద్యం అలవాటు ఉన్న భర్తతో భార్యకు తరచూ గొడవలు జరిగేవి. పేరంటాలు సంబరం గురువారం చేశారు. ఈ సందర్భంగా అతిగా మద్యం సేవించిన భర్తతో భార్య గొడవ పడింది. దీంతో సమీప తోటల్లోకి వెళ్లి పురుగుల మందు సేవించారు. అపస్మారక స్థితికి చేరిన వ్యక్తిని 108 వాహనంలో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, రిమ్స్‌లో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్డు(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. కుద్దిరాం రైల్వేగేటు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తికి సుమారు 47 సంవత్సరాల వయసు ఉంటుందన్నారు. మృతుడు బిస్కెట్ కలర్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించడం జరిగిందన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి


లక్ష్మీనారాయణ(ఫైల్)

హిరమండలం: మండలంలోని అంబావల్లి గ్రామానికి చెందిన చిట్టి లక్ష్మీనారాయణ (74) శుక్రవారం మృతి చెందారు. ఏప్రిల్ 27న ఇంటి డాబా పైనుంచి ప్రమాదవశాత్తూ కిందకు పడిపోయాడు. ఈ ప్రమాదంలో సిమ్మెంట్ రహదారికి తల తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శ్రీకాకుళం జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం లక్ష్మీనారాయణ మృతి చెందారు. మృతుడికి భార్య మల్లేశ్వరి, వివాహం జరిగిన కుమార్తె ఉంది. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బీహెచ్ రమణ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


శంకరరావు మృతదేహం

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామానికి చెందిన బుడుమూరు శంకరరావు (32) శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు శంకరావు ఈనెల 5వ తేదీన ఇంటి వద్ద మద్యం మత్తులో పురుగుల మందు సేవించాడు. దీంతో మరుసటి రోజు ఆయనకు విరోచనాలు, వాంతులు ఎక్కువ కావడంతో అసలు విషయం తన తల్లికి చెప్పాడు. దీంతో ఆమె శంకరరావును ఆటోలో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. అక్కడ వైద్యం పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు తెలియజేశారు. మృతుడుకి భార్య జ్యోతి, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మృతుడు తండ్రి ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు తల్లి చిన్నమ్ముడు ఇచ్చిన ఫిర్యాదుతో స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌లో ఉంచారు.

స్వస్థలాలకు వలస కార్మికులు


మస్కట్ నుంచి జిల్లాకు చేరిన వలస కార్మికులు

ఇచ్ఛాపురం/ఇచ్ఛాపురం రూరల్: ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అక్కడ చిక్కుకున్న జిల్లాకు చెందిన వలస కార్మికులు సురక్షితంగా స్వస్థలాలకు చేరుకున్నారు. 'మస్కట్‌లో చిక్కుకున్న శ్రీకాకుళం కార్మికులు' అనే శీర్షికన ఏప్రిల్ 18న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పందించారు. ఇందులో భాగంగా వలస కార్మికులతో వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. అనంతరం కార్మికుల కుటుంబ సభ్యులతో మాట్లాడి కార్మికులను సురక్షితంగా స్వస్థలాలకు చేర్చుతామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తొమ్మిది మంది వలస కార్మికులు శుక్రవారం వారి స్వస్థలాలకు చేరుకున్నారు. విదేశాల్లో పని లేక, ఆకలితో తీవ్ర ఇబ్బంది పడ్డామని, తమకు వేగంగా సహాయం చేసి ఇంటికి చేర్చినందుకు ఆనందం వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారమే తమకు ముఖ్యమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

నర్సింగ్ కళాశాలకు..
నిబంధనలు పట్టవా..?

- కళాశాలలో నిబంధనలకు నీళ్లు
- స్థానికంగా ఉండని రెగ్యులర్ ఉద్యోగులు
- డ్యూటీలతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇబ్బందులు

శ్రీకాకుళం:

జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న నర్సింగ్ కాలేజీకి ప్రభుత్వ నిబంధనలు పట్టడం లేదు. ఇటీవల మంగళవారం ఒక అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని నిబంధనలకు విరుద్ధంగా విజయవాడకు పంపించగా, అక్కడ సదరు ఉద్యోగి మృత్యువాతపడిన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయం సాక్షిలో ప్రచురితమైన అనంతరం అక్కడి విషయాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.





లేడీస్ హాస్టల్

లేడీస్ హాస్టల్లో పురుషులకు డ్యూటీ

నర్సింగ్ కాలేజీ హాస్టల్లో యువతులు ఉండగా.. ఇక్కడ పురుష ఉద్యోగులకు సెలవు రోజుల్లో డ్యూటీలను వేస్తున్నారు. రొటేషన్ పద్ధతిపై వారికి డ్యూటీలను వేస్తూ కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ అసిస్టెంట్ అజయ్ సంతకాలతో సర్క్యులర్‌లను కూడా జారీ చేస్తున్నారు. వాస్తవానికి బాలికలు, యువతులు, మహిళల విద్యాసంస్థల్లో గానీ, హాస్టల్స్‌లో గానీ 55 ఏళ్లలోపు ఉన్న పురుషులను విధుల్లో నియమించకూడదన్న నిబంధనలు ఉన్నాయి. దీనిని పట్టించుకోకుండా 27 ఏళ్ల వయసున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను సెలవు రోజుల్లో డ్యూటీలకు వేస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

వార్డెన్ లేకుండా వసతి గృహం

ఇదిలా ఉండగా హాస్టల్‌ను వార్డెన్ లేకుండానే నడిపిస్తున్నారు. నాలుగు నెలల క్రితం అవుట్ సోర్సింగ్ పద్ధతిపై ఒక మహిళను వార్డెన్‌గా నియమించారు. ఆమె విధుల్లో చేరిన తర్వాత 24 గంటలపాటు హాస్టల్లో ఉండాలని, బయటకు వెళ్లేందుకు వీల్లేదని ప్రిన్సిపాల్ నిబంధనలు విధించారు. దీంతో వారం రోజుల్లోనే ఆమె ఉద్యోగం నుంచి వైదొలిగినట్లు పలువురు చెబుతున్నారు. నర్సింగ్ కళాశాలలో ఒక ప్రిన్సిపాల్, ఒక ట్యూటర్, సూపరింటెండెంట్, ఏవో, ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు రెగ్యులర్ ఉద్యోగులు కాగా, వీరిలో 70 శాతం మంది విజయనగరం, విశాఖపట్నం నుంచి రాకపోకలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీరెవరూ సెలవు రోజుల్లో ఇక్కడ ఉండకపోవడం వలన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. వీరెవరికీ విజయవాడ వెళ్లడం ఇష్టంలేకపోవడంతో కిశోర్‌ను విజయవాడ పంపించారని పలువురు చెబుతున్నారు. ఆయనను విజయవాడ పంపించిన విషయంలోనూ నిబంధనలు పాటించలేదు. కాన్ఫిడెన్షియల్ సమాచారం పంపించినప్పుడు అందుకు సంబంధించిన సమాచారం రిజిస్ట్రార్‌లో నమోదు చేసి సంబంధిత ఉద్యోగితో సంతకం చేయించుకోవాల్సి ఉంటుంది. అతడిని కార్యాలయం పనిమీద ఎక్కడికి పంపిస్తున్నారో మూమెంట్ రిజిస్ట్రార్‌లో నమోదు చేసి సంబంధిత ఉద్యోగితో పాటు కాలేజీ యాజమాన్య ప్రతినిధి కూడా సంతకం చేయాల్సి ఉంటుంది. అతడిని పంపిస్తున్నట్లు ఒక లేఖను సిద్ధం చేసి ఉద్యోగికి ఇవ్వాలి. అలాగే టీఏ, డీఏగా అడ్వాన్స్ చెల్లిస్తే దాన్ని నమోదు చేయాలి. కానీ కిశోర్ విషయంలో ఇవేవీ పాటించలేదు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే నిబంధనలు పాటించకుండా జరుగుతున్న అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.


రొటేషన్ పద్ధతిలో విధులను కేటాయిస్తూ విడుదల చేసిన సర్క్యులర్

పరిశీలనకు నియామకం

సెలవు రోజుల్లో విద్యార్థినులు ఔటింగ్ అంటూ బయటకు వెళ్తారు. వారు సరైన సమయానికి వస్తున్నారా.. లేదా అనే పరిశీలన కోసమే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమిస్తున్నాం.
– ఝాన్సీలక్ష్మి, ప్రిన్సిపాల్, నర్సింగ్ కాలేజీ

న్యాయం చేయండి

- ప్రభుత్వానికి రైతు వేడుకోలు


తన భూమిని చూపిస్తున్న రైతు కోట రామ్మూర్తి

సంతబొమ్మాళి: తన భూమిలో పోర్టు యాజమాన్యం రెవెన్యూ, పోలీసు అధికారుల సాయంతో దౌర్జన్యంగా రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటోందని కూర్మనాథపురం గ్రామానికి చెందిన రైతు కోట రామ్మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరుతో తన గోడును వెళ్లబుచ్చాడు. పోర్టు రైల్వే లైన్ కోసం తన 58 సెంట్ల మెట్టు భూమిని ఇవ్వలేదన్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో సెంటు రూ.1.50 లక్షలు ఉండగా, ప్రభుత్వం కేవలం రూ.25 వేల పరిహారం మాత్రమే ఇస్తోందన్నారు. తనది మెట్టుభూమి అయితే పల్లపు భూమి అని నమోదు చేశారని మండిపడ్డాడు. దీంతో పరిహారం సరిపోదని జిల్లా కలెక్టర్, టెక్కలి ఆర్డీవో, తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇచ్చానన్నారు. అయితే మూడు నెలలు కావస్తున్నా న్యాయం జరగకపోవడంతో హైకోర్టును ఆశ్రయించానని దీనిపై కేసు నడుస్తోందని పేర్కొన్నారు. ఇప్పుడు హైకోర్టులో కేసు ఉండగా పోర్టు యాజమాన్యం రైల్వేలైన్ కోసం చదును చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన జీడి, మామిడి ఇతర మొక్కలను కూల్చివేసి రోడ్డు వేశారని మండిపడ్డారు. దీనిని తాను అడ్డుకుంటే దౌర్జన్యంగా పోలీసుస్టేషన్‌లో పెట్టారన్నారు. తనకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

కోచింగ్ సెంటర్‌లో దారుణం

- విద్యార్థిని చితకబాదిన నిర్వాహకులు
- తండ్రి ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం


కోచింగ్ సెంటర్ వద్ద వివరాలు నమోదు చేస్తున్న ఏఎస్ఐ సింహాచలం

నరసన్నపేట: స్థానిక ప్రశాంత్ నగర్‌లో కుందనా నవోదయ కోచింగ్ కేంద్రం నిర్వాహకులు విద్యార్థులను చితకబాదుతున్న వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పిల్లలను మంచిగా చదివిస్తామని నవోదయ ఎంట్రన్స్ పరీక్షలకు సిద్ధం చేస్తామని తల్లిదండ్రులను నమ్మించి జాయిన్ చేసుకున్నారు. తీరా అక్కడ విద్యార్థులను ఇష్టం వచ్చినట్లు కొడుతుండడంతో తల్లిదండ్రులు వీధికెక్కారు. దీంతో వ్యవహారం అంతా బయటకు వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పోలాకి మండలం ఈదులవలస గ్రామానికి చెందిన ముద్దాడ శ్రీనివాసరావు తన కుమారుడు శ్రీకర్‌ను కోచింగ్ కోసం కుందనా నవోదయ కోచింగ్ సెంటర్‌లో చేర్పించారు. అయితే గురువారం అబ్బాయి ఇంటికి వచ్చాక స్నానం చేయిస్తున్నప్పుడు వీపు, చెవులపై గాయాలు ఉండడాన్ని తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో విద్యార్థిని ప్రశ్నించగా కోచింగ్ సెంటర్‌లో టీచర్ కొట్టారని, చాలా అవమానకరంగా మాట్లాడారని తెలిపాడు.

పోలీసుల హెచ్చరిక

ఈ విషయంపై విద్యార్థి తండ్రి శ్రీనివాసరావు కోచింగ్ సెంటర్ నిర్వాహకులను ప్రశ్నించగా అతడినే కొడతామని వారు సమాధానం చెప్పారు. దీంతో విషయాన్ని శుక్రవారం పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఏఎస్ఐ సింహాచలం కోచింగ్ కేంద్రం వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇలా కొట్టడం మంచిది కాదని హెచ్చరించారు. సమాచారం తెలుసుకున్న ఏబీవీపీ ప్రతినిధి మదన్‌కుమార్ కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీశారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. బాలల హక్కులను కాలరాస్తున్న ఈ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలబాలికలకు రోజుకు 10 గంటలకు పైగా శిక్షణనిస్తున్నారని తెలిపారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపించారు. ఘటనపై కోచింగ్ కేంద్రం నిర్వాహకుడు వైకుంఠరావు మాట్లాడుతూ.. అనుకోకుండా గట్టిగా దెబ్బ తగిలిందని, అంతేతప్ప కావాలని పిల్లలను ఇబ్బంది పెట్టలేదన్నారు.

యాక్సిస్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాల్సిందే


విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

అరసవల్లి: రాష్ట్ర ప్రభుత్వం యాక్సిస్‌తో చేసుకున్న విద్యుత్ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసుకోవాలని వామపక్ష పార్టీ నేతలు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల అదనపు భారం, యాక్సిస్ ఒప్పందాల రద్దు కోరుతూ శుక్రవారం విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు మాట్లాడుతూ యూనిట్ విద్యుత్‌ను రూ.4.60 చొప్పున కొనుగోలు చేసుకునేందుకు ఏకంగా 25 ఏళ్లపాటు ఒప్పందం కుదుర్చుకోవడం దారుణమన్నారు. గత ప్రభుత్వం ఆదానీ సంస్థలతో సోలార్ విద్యుత్ యూనిట్ ధర రూ.2.49కే కొనుగోలు ఒప్పందం చేసుకుంటే.. ఇవే అధిక రేట్లంటూ పత్రికల్లో రాయించి రాద్ధాంతం చేసిన టీడీపీ.. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అంతకు రెట్టింపు డబ్బులు పెట్టి విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. తాజా యాక్సిస్ ఒప్పందం ద్వారా రాష్ట్ర ప్రజలపై ఏకంగా రూ.15 వేల కోట్ల భారం పడనుందని, తక్షణమే ఈ దొంగ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్‌చేశారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచకుండా తగ్గిస్తామని గద్దె నెక్కిన చంద్రబాబు ఇప్పుడు ఏడాదిలోనే మూడు సార్లు విద్యుత్ చార్జీలను పెంచేసి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, సర్‌చార్జీల పేరిట విద్యుత్ వినియోగదారులపై బాదుడే బాదుడు అంటే ఏంటో చూపించారని విమర్శించారు. దేశంలో అనేక రాష్ట్రాలు రూ.2, రూ.2.50కే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటుంటే మన రాష్ట్రంలో మాత్రం రూ.4.60కి కొనుగోలు ఒప్పందాలు చేసుకుంటున్నారంటే.. అక్రమాలకు తెరతీసినట్లుగా ప్రజలు భావిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ అమ్మన్నాయుడు, వివిధ సంఘాల నేతలు ఎం.ఆదినారాయణమూర్తి, కొత్తకోట అప్పారావు, అల్లు సత్యన్నారాయణ, కె.సూరయ్య, ఎన్.వి.రమణ, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కనే ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగింది. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారులపై ప్రమాదాలకు అవకాశాలు ఉన్న చోట్ల ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేయాలన్నారు. డివైడర్లను తొలగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ శాఖలు ఇటీవల జరిగిన ప్రమాదాలను విశ్లేషణ చేసి నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో 108 వాహన సేవలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విజయ సారథి, ఎన్‌హెచ్ ప్రాంతీయ ప్రాజెక్టు డైరెక్టర్ తివారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, డీఎంహెచ్‌వో అనిత తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ చోరీకి యత్నం

టెక్కలి రూరల్: స్థానిక రెడ్‌క్రాస్ వీధి సమీపంలో శుక్రవారం ఒక ద్విచక్ర వాహనంపై గుర్తు తెలియని ఇద్దరు యువకులు వచ్చి ఒక్కసారిగా కింద పడిపోయినట్లు నటించారు. అక్కడే ఉన్న పండిత శ్రీను అనే వ్యక్తి వారిని పైకి లేపేందుకు ప్రయత్నిస్తుండగా ఆ ద్విచక్ర వాహనం వెనుకనున్న వ్యక్తి అతని షర్ట్‌జేబు నుంచి సెల్‌ఫోన్ చోరీకి ప్రయత్నించాడు. వెంటనే అప్రమత్తమైన శ్రీను వారి చేతి నుంచి సెల్ తీసుకున్నాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై అక్కడ నుంచి పరారయ్యారు. ఇది గుర్తించి మరో వ్యక్తి వారిని వెంబడించాడు. స్థానిక ఇందిరా గాంధీ జంక్షన్ వద్ద ట్రాఫిక్‌లో వారిని పట్టుకునే ప్రయత్నం చేయడంతో ఆ ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనం అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దుండగులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అయితే ఈ తరహాలో అనేకసార్లు చోరీలు జరగడంతో ఆ చోరీలతో ఈ యువకులకు సంబంధంపై పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

కత్తితో దాడిచేసిన వ్యక్తికి నాలుగేళ్ల జైలు

కాశీబుగ్గ: పలాస మండలంలోని బ్రాహ్మణతర్లా పంచాయతీ పండాశాసనాంకు చెందిన వడ్డి సంతోషకుమార్‌పై శుక్రవారం సోంపేట కోర్టులో కేసు విచారణ జరిగింది. అసిస్టెంట్ సెషన్ జడ్జి జె.శ్రీనివాస్ నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1000ల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. అపరాధ రుసుము కట్టకుంటే మూడు నెలలు సాధారణ జైలు శిక్ష సైతం విధించబడుతుందన్నారు. 2022 జనవరి 22వ తేదీన అదే గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణారావుపై కత్తితో సంతోష్‌కుమార్ దాడి చేశాడు. దీంతో కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ సెక్షన్ 307, 324 కేసులను నమోదు చేసి అప్పటి సీఐ శంకరరావు రిమాండ్‌కు తరలించారు.

ఉత్సాహంగా ఉషూ ఎంపిక పోటీలు


ఎంపికలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగాయి. జిల్లా ఉసూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం జిల్లాస్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ ఉషూ ఎంపిక పోటీలు నిర్వహించారు. అంతకుముందు ఉదయం ఈ ఎంపిక పోటీలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డాక్టర్ కె.శ్రీధర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ప్రశాంతతతో పాటు ఉజ్వల భవిష్యత్ కూడా సొంతమవుతుందన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ ఉషూ క్రీడాకారులు దశాబ్దకాలంగా రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం సంతోషకరమన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 12 నుంచి 14 వరకు కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి ఉషూ చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామని ఉషూ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్‌లో విద్యారంగం తీవ్ర ఒడిదుడుకులకు గురవుతోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సంఘ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన ధర్నా శిబిరాన్ని ప్రారంభించారు. పాఠశాలలకు సంబంధించి పాత విధానాన్నే కొనసాగించాలన్నారు.ఉపాధ్యాయుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 55 ప్రకారం పోస్టులు కొనసాగించాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి డి.సరస్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వి.అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి దాసరి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి వి.నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్‌తో టీచర్లకు అన్యాయం

శ్రీకాకుళం: కూటమి ప్రభుత్వం చేపట్టనున్న టీచర్ల బదిలీల్లో రేషన్‌లైజేషన్‌కు గురైన టీచర్లకు అన్యాయం జరుగుతోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల స్ట్రక్చర్‌లో మార్పులు కారణంగా తమ ప్రమేయం లేకుండానే టీచర్లు పెద్ద ఎత్తున రేషన్‌లైజేషన్‌కు గురవుతున్నారని, బదిలీల్లో తగిన ప్రాధాన్యత లేకపోవడం వల్ల దూర ప్రాంతాలకు బదిలీ అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు, నాలుగు, ఐదు తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేయడం వల్ల అక్కడ పనిచేస్తున్న ఎస్జీటీలు, ప్రాథమికోన్నత పాఠశాలలో డీగ్రేడ్ చేయడం వల్ల అక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులు వెనక్కి రావడం వల్ల అక్కడ పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు రేషన్‌లైజేషన్ అవుతున్నారని, వీరి విషయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు ఏకపక్ష వైఖరితో ముందుకు వెళ్లడం సరికాదన్నారు.

మొక్కజొన్నకు 'మద్దతు' కరువు..!

- తక్కువకు కొనుగోలు చేస్తున్న దళారులు
- బస్తాకు రూ.125ల వరకు నష్టపోతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

నరసన్నపేట:


మొక్కజొన్నను సంచులకు ఎత్తుతున్న రైతులు

ఎన్నో ఆశలతో మొక్కజొన్న పండించిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. ప్రస్తుతం పంట పూర్తిగా కోతకు వచ్చి దిగుబడులు రైతుల చేతికొచ్చాయి. అయితే ఆశించిన ధర లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్ రెండో వారం నుంచి మొక్కజొన్న కోతకు రాగా.. ఇప్పటికీ ధర పెరగగపోవడంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాలో 9000 ఎకరాల్లో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. ఎకరాకు 30 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వస్తున్నా మద్దతు ధర రాకపోవడంతో ఆశించిన ఆదాయం పొందలేకపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం మొక్కజొన్న వంద కేజీల బస్తాకు రూ.2,225లుగా మద్దతు ధర ప్రకటించింది. అయితే జిల్లాలో అధికారికంగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులే దిక్కు అయ్యారు. వీరితో పాటు ప్రైవేటు వ్యాపారులు నిర్ణయించిన ధరకే రైతులు విక్రయాలు చేయాల్సి వస్తోంది. దళారులు బస్తాకు 101 కేజీలు తీసుకుంటున్నారు. అరువు పద్ధతిన బస్తాను రూ.2,100 కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు బస్తాపై సుమారుగా రూ.125లు మేరకు మద్దతు ధర నష్టపోతున్నారు. అదే జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని రైతులు అంటున్నారు. వ్యవసాయ మంత్రి ఇదే జిల్లాలో ఉన్నా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం శోచనీయమని రైతులు అంటున్నారు. బస్తాపై రూ.125 చొప్పున లెక్క వేస్తే ఒక ఎకరా పండించే రైతు దాదాపు రూ.3,100 నుంచి రూ.5 వేల వరకు నష్టపోతున్నాడు.

మద్దతు ధర రాలేదు

మొక్కజొన్న పంటకు శ్రమ ఎక్కువ. చీడపీడలూ ఎక్కువే. పంటను చివరి వరకు కాపాడుకొని వస్తే పంట చేతికొచ్చాక ఆశించిన ధర రాకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. మద్దతు ధర లభించకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్రం ప్రకటించిన ధర అంది ఉంటే మంచి ఆదాయం వచ్చేది.
– ఎస్వీ రమణ, లింగాలపాడు, నరసన్నపేట

రైతులను పట్టించుకోలేదు

రబీలో ప్రతిఏటా మొక్కజొన్న వేస్తున్నాం. గతంలో అయితే మద్దతు ధరకు మించి ధర పలికేది. రైతులకు మంచి ఆదాయం వచ్చేది. ఈసారి ప్రభుత్వం మొక్కజొన్న రైతుల కోసం పట్టించుకోకపోవడంతో నష్టపోయారు. రెండు ఎకరాల్లో పంట వేయగా 70 బస్తాలు దిగుబడి వచ్చింది. దాదాపు రూ.8 వేలు వరకు నష్టపోయాను.
–తోట భార్గవ్, గోపాలపెంట, నరసన్నపేట

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు మార్క్‌ఫెడ్ అధికారులు ఏర్పాటు చేయాలి. స్థానికంగా మొక్కజొన్న పంటకు మద్దతు ధర రావడం లేదనేది అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. చోడికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. అవికూడా అన్ని చోట్ల కాకుండా చోడి పంట ఎక్కువగా పండించిన చోట్ల సంతబొమ్మాళి వంటి ప్రాంతాల్లో పెట్టారు.
– రవీంద్రభారతి, ఏడీ, నరసన్నపేట